క్లుప్తంగా

వరద బాధితులకు విరాళాలు అందించాలి

నెహ్రూనగర్: వరద బాధితుల కోసం విరాళాలు అందించాలని నగర కమిషనర్ పి.శ్రీనివాసులు కోరారు. విరాళం అందించాలనుకునే దాతలు కలెక్టర్, డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ గుంటూరు డిస్ట్రిక్ట్ పేరుతో ఐడీఎఫ్‌సీ బ్యాంక్ అకౌంట్ నంబర్ 33260919895, ఐఎఫ్ఎస్సీ కోడ్ ఐడీఎఫ్‌సీ 0081061 పేరుతో చెక్‌లు, డీడీలు అందించవచ్చని బుధవారం ఒక ప్రకటనలో కమిషనర్ కోరారు. వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలకు అండగా నిలవడానికి విరాళాలు అందించడానికి పలువురు ముందుకు వస్తున్నారని, విరాళాలు అందించే వారి కోసం ప్రత్యేకంగా బ్యాంకు అకౌంట్ ప్రారంభించడం జరిగిందన్నారు. విరాళాలు అందించాలి అనుకునే దాతలు కలెక్టర్, డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ గుంటూరు డిస్ట్రిక్ట్ పేరుతో పంపించాలన్నారు. గుంటూరు నగరపాలక సంస్థ కూడా విరాళాలు, వస్తువుల సేకరణకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసిందన్నారు.

విజిలెన్స్ అధికారిగా సూర్యశ్రావణ్‌కుమార్

నగరంపాలెం: గుంటూరు రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి (ఆర్‌వీఈఓ)గా డి.సూర్యశ్రావణ్‌కుమార్ నియమితులయ్యారు. ఇప్పటి వరకు జిల్లా అధికారిగా, ఒంగోలు, శ్రీపొట్టిశ్రీరాముల నెల్లూరు జిల్లాకు అదనపు బాధ్యతలు చేపట్టిన కె.ఈశ్వరరావును పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు.

పట్టాభిపురం సీఐగా వీరేంద్రబాబు

నగరంపాలెం: పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ సీఐగా వీరేంద్రబాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. వీఆర్‌లో నుంచి ఇక్కడికి రానున్నారు. ఇటీవల సార్వత్రిక ఎన్నికల ముందు కొన్నాళ్లు పట్టాభిపురం సీఐగా విధులు నిర్వర్తించారు.

పాత గుంటూరు ఎస్ఐగా వెంకటేశ్వరరావు

పాతగుంటూరు పోలీస్‌స్టేషన్(పీఎస్) ఎస్ఐగా పి.వెంకటేశ్వరరావు బుధవారం పీఎస్‌లో బాధ్యతలు స్వీకరించారు. వీఆర్‌లో ఉన్న ఆయన్ను పాతగుంటూరు పీఎస్ ఎస్ఐగా పోస్టింగ్ ఇచ్చారు. ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన ఆయన సీఐ వైవీ సోమయ్యను మర్యాద పూర్వకంగా కలిశారు.

ప్రయాణికుడి జేబులో రూ.50 వేలు చోరీ

ప్రయాణికుడి జేబులో నగదు చోరీపై కొత్తపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం వేలవారిపాలెం గ్రామానికి చెందిన జె.రాఘవులు అతడి సోదరుడు కలిసి మరదలు కొడుకు చికిత్స పొందుతున్న గుంటూరు కొత్తపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి బయలుదేరారు. ఈ క్రమంలో బస్టాండ్ వద్దనున్న ఓ బార్ వద్ద ఆస్పత్రి వెళ్లేందుకు ఇద్దరు ఆటో ఎక్కారు. అనంతరం ఆటో దిగగా జేబులోని రూ.50 వేలు కనిపించలేదు. దీంతో బాధితుడు కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా వర్షాలు

- తాడేపల్లిలో 27.8 మి.మీ. వర్షం
- సగటున 11.6 మి.మీ. వర్షపాతం

కొరిటెపాడు(గుంటూరు): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వలన గుంటూరు జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలో మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు అత్యధికంగా తాడేపల్లి మండలంలో 27.8 మిల్లీ మీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా పొన్నూరు మండలంలో 0.4 మి.మీ. వర్షం పడింది. సగటున 11.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు.. దుగ్గిరాల మండలంలో 27.4 మి.మీ., కొల్లిపర 18.8, తాడికొండ 17.2., మంగళగిరి 16, పెదకాకాని 14.8, తెనాలి 14.2, తుళ్లూరు 13.8, గుంటూరు తూర్పు 12.4, గుంటూరు పశ్చిమ 12, మేడికొండూరు 9, ఫిరంగిపురం 6.2, వట్టిచెరుకూరు 6.2, చేబ్రోలు 5.4, పెదనందిపాడు 1.2, కాకుమాను మండలంలో 0.6 మి.మీ చొప్పున వర్షం పడింది. సెప్టెంబర్ మాసం 4వ తేదీ వరకు జిల్లాలో సాధారణ వర్షపాతం 19.1 మి.మీ. పడాల్సి ఉండగా, ఇప్పటి వరకు 171.3 మి.మీ. వర్షపాతం నమోదైంది. మరో రెండు, మూడు రోజులపాటు జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. భారీ వర్షాలకు రైతులు అప్రమత్తంగా ఉండాలని శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. పంట పొలాల్లో నిలిచిన నీటిని సాధ్యమైనంత వరకు బయటకు పంపి పంటలను కాపాడుకోవాలన్నారు.

అలరించిన రాయభారం ఘట్టాలు



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం శ్రీపద్మావతి కళ్యాణ వేదికపై ప్రముఖ రంగస్థల నటులు, దర్శకులు శెట్టిపల్లి నాగేశ్వరరావు 40వ వర్ధంతి వేడుకలు బుధవారం నిర్వహించారు. శెట్టిపల్లి చిట్టిబాబు నిర్వహణలో పాండవోద్యోగంలోని మయసభ, పడకసీను, రాయబారం ఘట్టాలను ప్రదర్శించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు సిహెచ్.మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. మయసభలో దుర్యోధనుడిగా షేక్ లాల్‌అహ్మద్, పడకసీనులో శ్రీకృష్ణుడిగా కె.శివప్రసాదరావు, అర్జునుడిగా యు.మునుస్వామి, దుర్యోధనుడిగా ఎస్.చిట్టిబాబు, రాయబారం ఘట్టంలో శ్రీకృష్ణుడిగా ఎంవీ సుబ్బారెడ్డి, దుర్యోధనుడిగా ఎస్.చిట్టిబాబు, కర్ణుడిగా లాల్‌అహ్మద్, అశ్వత్థామగా కె.శ్రీనివాసరావు, ధృతరాష్ట్రుడుగా షేక్.నాజర్ తదితరులు తమ పాత్రల్లో చక్కని హావభావాలను పలికించారు. ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. సంగీతం సిరిగిరి సాంబశివరావు, మేకప్ కె.శ్రీనివాసరావు అందించారు.

వరదలతో వ్యాధుల ప్రమాదం

- అతిసారానికి అవకాశం
- పాముకాటుతో జాగ్రత్త
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- వరద ప్రాంతాల్లో ప్రత్యేక వైద్యశిబిరాలు





ప్రత్యేక వైద్యశిబిరాలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ విజయలక్ష్మి

గుంటూరు మెడికల్: కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు అనేక ప్రాంతాలలో వరద నీరు ముంచెత్తింది. పలు లంక గ్రామాలు, ఊళ్లు వరదనీటితో నిండిపోయాయి. అనేక ప్రాంతాల నుంచి చెత్తా, చెదారం, వ్యర్థాలన్నీ వరదనీటిలో వచ్చి ఇళ్ల చుట్టు పక్కలే నిల్వ ఉండిపోయాయి. దీని వల్ల వ్యాధులు ప్రబలే అవకాశాలు మెండుగా ఉంది. ముఖ్యంగా తాగు నీటిలో కూడా వరదనీరు కలసి వచ్చే అవకాశాలు ఉన్న దృష్ట్యా నీటిని శుద్ధి చేసుకుని తాగని పక్షంలో డయేరియా బారిన పడే అవకాశం ఉంది. కొద్ది రోజులకు వరద ఉధృతి తగ్గిన పిదప వ్యాధులు ప్రబలొచ్చు. పాముకాటు, తేలుకాటు, డయేరియా కేసులు, అలర్జీ, చర్మ సంబంధిత కేసులు నమోదయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వ్యాధులపై కొద్దిపాటి అవగాహన కలిగి ఉండటంతో పాటుగా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

అతిసార వ్యాధిపై...

వరద ప్రభావిత ప్రాంతాల్లో డయేరియా కేసులు నమోదయ్యే అవకాశాలు ఉన్నాయి. వ్యాధి బారిన పడకుండా ముందస్తుగా వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి. కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. విరేచనాలు నీళ్ల నీళ్లగా, పలచగా అవుతుంటే డయేరియా (అతిసార వ్యాధి) అంటారు. వైద్య పరిభాషలో దీనిని గ్యాస్ట్రో ఎంటెరైటిస్‌గా పిలుస్తారు. నీళ్ల విరోచనాలు నూటికి 70 శాతం వైరస్ క్రిముల వల్ల వస్తాయి. కలుషితమైన నీటిని తాగటం, మలం మీద వాలిన ఈగలు ఆహార పదార్థాలపై వాలాక ఆ ఆహారం తినటం ద్వారా వివిధ రకాల బ్యాక్టీరియా, వైరస్‌లు శరీరంలోకి ప్రవేశించి విరేచనాలు అవుతాయి.

లక్షణాలు...

జీర్ణ వ్యవస్థ పనితీరు అస్తవ్యస్తంగా ఉండి వాంతులు, విరేచనాలు అవుతాయి. విరేచనాలు నీళ్లు, నీళ్లగా పలుచగా కావటం, కడుపులో మెలిపెట్టినట్లు నొప్పి ఉంటుంది. నీరసం, వికారం, వాంతులు, శరీరంలో లవణాలు పోయి పిక్కలు నొప్పులు వస్తాయి. మనం తాగే నీరు శరీరం నుంచి అధిక మొత్తంలో బయటకు వెళిపోతే డీహైడ్రేషన్ ఏర్పడి ప్రమాదకర పరిస్థితి ఏర్పడుతుంది. దీని వలన పిల్లలకు, వృద్ధులకు ఎక్కువ ప్రమాదం.

పాముకాటుపై అప్రమత్తం...



వర్షం, వరదల వల్ల భూమిలోపలి పొరల్లోకి నీరుచేరి కన్నాలు, బొరియలు పూర్తిగా నీటితో నిండిపోయి ఉండేందుకు వీలులేని పరిస్థితుల్లో పాములు బయటకు వస్తాయి. పొలాల్లో, డొంకల్లో అటూ ఇటు తిరిగే మనుషులు తమను చంపేందుకు వచ్చారేమోననే భయంతో పాములు కాటు వేస్తాయి. అలాంటి సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవటం ద్వారా ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడవచ్చు.

పాము కరిచినప్పుడు...

పాము కరిచిన వెంటనే కాటు వేసిన భాగాన్ని మొట్టమొదటిగా పరీక్షించాలి. కాటు వేసిన ప్రదేశంలో రెండు గాట్లు మాత్రమే ఉంటే అది విషంతో కూడిన పాము కాటుగా గుర్తించాలి. కరిచిన శరీర భాగంలో వాపు రావటం, నల్లగా కమిలినట్లు ఉండటం, నొప్పి ఉండటం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. రెండు గాట్లు లేకుండా వి ఆకారంలో కింద, పైన పళ్ల గుర్తులు ఉంటే అది విషం లేని పాముకాటు అని తెలుసుకుని బాధితుడికి ముందుగా బాగా ధైర్యం చెప్పాలి.

గాయాన్ని శుభ్రం చేయాలి...

కరిచిన భాగాన్ని కాని, రోగిని కాని కదలనివ్వకూడదు. పాము కరిచినచోట రుద్దకూడదు. పాము కాటు వల్ల ఏర్పడ్డ గాయాన్ని సబ్బునీళ్లతో కడగాలి. ఐస్ ముక్కలు ఒక గుడ్డలో చుట్టి పాముకాటు భాగం వద్ద ఉంచాలి. కరిచిన వెంటనే వాంతి చేసుకున్నట్లయితే రోగిని పక్కకు తిప్పి పడుకోబెట్టి ఊపిరి అందేటట్లు చూడాలి. కాటు వేసిన ప్రదేశాన్ని బ్లేడుతో కోయటం గాని, నోరు పెట్టి రక్తాన్ని తీయటం గాని ఎట్టి పరిస్థితుల్లో చేయకూడదు. కాటేసిన ప్రదేశాన్ని తాడుపెట్టి గట్టిగాకట్టి ప్రతి రెండు మూడు గంటలకు ఒకసారి తాడును వదులు చేస్తూ ఉండాలి. ఎట్టి పరిస్థితుల్లో ఆకు పసరలు మింగించటం కాని, కరిచిన భాగంలోకి పోయటం గాని చేయకూడదు. కరిచిన పామును సాధ్యమైతే చంపి పట్టుకొని డాక్టర్ వద్దకు తీసుకెళ్ళటం వల్ల పాము ఎలాంటిదో తెలుసుకుని వైద్యం చేసేందుకు చాలా సులువుగా ఉంటుంది. పామును తలపై చితకొట్టి తీసుకెళ్లటం వల్ల గుర్తించేందుకు వీలు ఉండదు. కరిచిన భాగాన్ని గుండె కంటే పై ఎత్తులో ఉంచకూడదు.

డయేరియా రాకుండా ఇలా చేయాలి....



వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలు తప్పనిసరిగా కాచి చల్లార్చిన నీటిని తాగాలి. మల, మూత్ర విసర్జన పిదప, భోజనం చేసే ముందు తప్పనిసరిగా సబ్బుతో చేతులు శుభ్రం చేసుకోవాలి. ఇంటి చుట్టుపక్కల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవటంతో పాటుగా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. రోడ్డుపైన, తోపుడు బండ్లపై మూతలు లేకుండా అమ్మే ఆహార పదార్థాలు తినకుండా ఉండాలి. ఇంట్లో వైద్యాలు, మందుల షాపుల వద్దకు వెళ్ళి మందులు తెచ్చుకోవటం చేయవద్దు. డయేరియా వచ్చినప్పుడు అర్హత ఉన్న వైద్యనిపుణుడి వద్దకు వెళ్లాలి.

–డాక్టర్ ఆళ్ల సిద్ధార్థరెడ్డి, గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్, గుంటూరు.

ప్రత్యేక వైద్య శిబిరాల్లో 24 గంటలు వైద్యసేవలు



గుంటూరు జిల్లా వ్యాప్తంగా వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక వైద్యశిబిరాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశాం. పునరావస కేంద్రాల్లో 24 గంటలు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి వైద్యసేవలు అందించి వ్యాధుల ప్రబల కుండా చర్యలు తీసుకుంటున్నాం. ఆగస్టు 31 నుంచి ప్రత్యేక వైద్యశిబిరాలను నిర్వహిస్తున్నాం. ఇప్పటి వరకు 36 ప్రత్యేక వైద్యశిబిరాలు పెట్టాం . వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు ఉంటున్న పునరావస కేంద్రాలు తీసివేసే వరకు ప్రత్యేక వైద్యశిబిరాలను కొనసాగిస్తాం. అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో మందులు, ఇంజక్షన్లు సిద్ధం చేసి ఉంచాం

–డాక్టర్ కొర్రా విజయక్ష్మి , డీఎంహెచ్‌ఓ, గుంటూరు.

పిల్లలకు ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాలి...



డయేరియా వలన పెద్దవారి కంటే పిల్లలకు ఎక్కువగా ఇబ్బందికరమైన పరిస్థితులు వస్తాయి. వ్యాధి లక్షణాలు గుర్తించి దాహం పెరిగితే ఓఆర్ఎస్ ప్యాకెట్లు తాగించాలి. ప్రతి ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా అందిస్తారు. ఒక ప్యాకెట్ పొడర్‌ను లీటర్ నీటిలో కలుపుకుని తాగాలి. విరేచనాలు అయ్యేవారికి కారం, మసాల వంటి ఘాటు పదార్థాలు పెట్టకూడదు. ద్రవరూపంలో ఉండే ఆహారం అందజేయాలి. మజ్జిగ, పాలు, బార్లీ గంజి, పలచగా తయారు చేసిన సగ్గు బియ్యం, రాగి జావ, కొబ్బరి నీళ్లు, నిమ్మ రసం, సోయాబీన్స్ రసం, ఇతర పళ్లరసాలు ఇవ్వొచ్చు.

–డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు , పిల్లల వైద్య నిపుణులు, గుంటూరు

వరద బాధితులకు ఆహారం తరలింపు



వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న వడ్లమాని రవి, పక్కన రామచంద్రరాజు

గుంటూరు ఎడ్యుకేషన్: విజయవాడలోని వరద బాధితుల సహాయార్థం బుధవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ గుంటూరు శాఖ తరపున ఆహారంతో పాటు తాగునీటి బాటిళ్లను ప్రత్యేక వాహనంలో పంపించారు. కలెక్టర్ బంగ్లారోడ్డులోని రెడ్ క్రాస్ కార్యాలయం నుంచి వరద బాధిత కుటుంబాలకు పంపిణీ చేసేందుకు ఆహారం, మంచినీటి బాటిల్స్‌తో బయలుదేరిన వాహనాన్ని రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ వడ్లమాని రవి జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా విజయవాడలో వరదలు సంభవించి వేలాదిమంది నిరాశ్రయులయ్యారని, ఆహారం, మంచినీళ్లు లేక అలమటిస్తున్నారని అటువంటి వారిని ఆదుకోవడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. జిల్లా కలెక్టర్ సూచన ప్రకారం విజయవాడలోని బాధిత కుటుంబాల కోసం గుంటూరు రెడ్ క్రాస్ నుంచి వాటర్ బాటిల్స్, బిస్కెట్ ప్యాకెట్స్ తో కూడిన వాహనాన్ని పంపినట్లు తెలిపారు. రెడ్ క్రాస్ జిల్లా వైస్ చైర్మన్ పి.రామచంద్రరాజు మాట్లాడుతూ ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు బాధిత ప్రజలను ఆదుకునేందుకు రెడ్ క్రాస్ ఎప్పుడు ముందుంటుందని, గుంటూరు జిల్లాలో వరద ప్రభావిత మండలాల్లో సంస్థ ద్వారా సహాయక చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. వరద బాధిత కుటుంబాలకు అత్యవసరమైన సరుకులు, బియ్యం, మంచినీరు తదితర సామగ్రిని రెడ్ క్రాస్ ద్వారా పంపిణీ చేసేందుకు దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సభ్యులు సాయికృష్ణ శ్రీనివాస్, ఎ.రవి శ్రీనివాస్, అరుణ్ కుమార్, పిచ్చిరెడ్డి, వలంటీర్లు పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులకు నిత్యావసరాలు అందజేత



బాధితులకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న డాక్టర్ షమ సుల్తానా

గుంటూరు మెడికల్: తుఫాన్ బాధితులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని హోప్‌విన్ హాస్పిటల్స్ చైర్మన్, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ షమ సుల్తానా పిలుపునిచ్చారు. పొన్నూరు నియోజకవర్గ పరిధిలోని నంబూరు యానాది కాలనీలో హోప్ విన్ హాస్పిటల్స్ వ్యవస్థాపకులు, లాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ నజీరుద్దీన్, డాక్టర్ షమ సుల్తానాల ఆధ్వర్యంలో 170 మంది బాధిత కుటుంబాలకు నిత్యవసరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ షమా సుల్తానా మాట్లాడుతూ ఎమర్జెన్సీ మందులు కూడా త్వరలో అందజేస్తామన్నారు. దాతలు, స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు రావాలని కోరారు. పిల్లలు అనారోగ్యంతో ఉంటే వారికి వైద్య సేవలు అందించి వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయటంలో తల్లిదండ్రుల పాత్ర కీలకమన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. పేదల ఆరోగ్యానికి హోప్ విన్ హాస్పిటల్స్ భరోసాగా నిలుస్తుందని తెలిపారు. ఏ అనారోగ్యం వచ్చిన అతి తక్కువ ఖర్చుతో వైద్య సేవలు అందించేందుకు తాము ఎల్లప్పుడు ముందుటామని పేర్కొన్నారు. హోప్ విన్ హాస్పిటల్స్ డాక్టర్స్, మేనేజర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం

నెహ్రూ నగర్: వరద బాధితుల నగరపాలక సంస్థ రెవెన్యూ అధికారి రెహమాన్ రూ.5 వేలు విరాళం అందించారు. వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలకు అండగా నిలవడానికి గుంటూరు నగరపాలక సంస్థ విరాళాలు, వస్తువుల సేకరణకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సెల్‌లో రెహమాన్ ముందుగా విరాళం అందించి పలువురికి ఆదర్శంగా నిలిచారని కమిషనర్ పులి శ్రీనివాసులు పేర్కొన్నారు.

గుంటూరు రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల నిరసన

- సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్ కోసం గుంటూరు రైల్వే స్టేషన్‌లో పడిగాపులు
- గుంటూరు స్టేషన్‌కు రాకుండా తెనాలి మీదుగా విజయవాడ చేరిన రైలు
- రైల్వే స్టేషన్‌లో ఆందోళన చేస్తున్న ప్రయాణికులు

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే స్టేషన్ అధికారుల సమన్వయలోపంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాలు.. రైలు నంబర్ 12295 సంఘ మిత్ర రైలు ప్రతి రోజు రాత్రి 9.40 గంటలకు విజయవాడ నుంచి బయలు దేరి వయా ఖమ్మం, వరంగల్, రామగుండం మీదుగా వారణాసి ధనపూర్ వరకు ప్రయాణిస్తుంది. అయితే రోజు మాదిరిగా విజయవాడ నుంచి వారణాసి వెళ్లే ప్రయాణికులు సుమారు 100 మంది బుధవారం టికెట్ రిజర్వేషన్ చేసుకున్నారు. అయితే ప్రయాణికులకు విజయవాడ నుంచి వెళ్లాల్సిన సంఘ మిత్ర రైలు కొన్ని అనివార్య కారణాల వల్ల డైవర్షన్ చేస్తూ తెనాలి, గుంటూరు, పగడిపల్లి, ఖాజీపేట మీదుగా ప్రయాణిస్తుందని విజయవాడ స్టేషన్‌కు తాత్కాలికంగా రద్దు చేయడం జరిగిందని మొబైల్ మెసేజ్‌లు రాత్రి 07.51 గంటలకు సమాచారం వచ్చింది. దీంతో విజయవాడ స్టేషన్‌లో ఉన్న సుమారు వంద మంది వారణాసి వెళ్లే ప్రయాణికులు గుంటూరు రైల్వే స్టేషన్‌కు రాత్రి 9 గంటలకు చేరుకున్నారు. అయితే ప్రయాణికులు ఎంతసేపటికి రైలు గుంటూరు రైల్వే స్టేషన్ మీదుగా ఐఆర్‌సీటీసీ యాప్ ద్వారా పరిశీలించగా సంఘమిత్ర రైలు గుంటూరు రైల్వే స్టేషన్ మీదుగా చూపించడం లేదు. దీంతో ప్రయాణికులు రైల్వే స్టేషన్‌లోని సంబంధిత రైల్వే టికెట్ కౌంటర్ సిబ్బందిని సమాచారం కోరగా సరైన సమాధానం చెప్పక పోగా దురుసుగా వ్యవహరించారని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే సుమారు 10.15 గంటల సమయంలో రైలు గుంటూరు స్టేషన్‌కు రావడం లేదని తెనాలి స్టేషన్ నుంచి విజయవాడ మీదుగా వారణాసి వెళ్తోందని తెనాలి స్టేషన్‌కు సంఘమిత్ర రైలు చేరుకుని విజయవాడ బయలుదేరే సమయానికి గుంటూరు రైల్వే స్టేషన్‌లో మైక్ ద్వారా సమాచారం ఇచ్చారు. దీంతో ప్రయాణికులు ఆగ్రహంతో రైల్వే స్టేషన్‌లోని టికెట్ కౌంటర్ సిబ్బంది వద్దకు వెళ్లి గుంటూరు రైల్వే స్టేషన్ రావల్సిన రైలు విజయవాడ స్టేషన్‌కు ఎలా వెళ్లిదని తమ మొబైల్స్‌కు వచ్చిన సమాచారంలో తెనాలి వయా గుంటూరు అని ఉందని నిలదీశారు. దీంతో రైల్వే సిబ్బంది సరైన సమాచారం చెప్పలేదు. దీంతో ప్రయాణికులు వారణాసిలో తాము ఉద్యోగస్తులమని ఉద్యోగ భద్రత ఎలా అంటూ రైల్వే స్టేషన్‌లో బుధవారం రాత్రి ఆందోళనకు దిగారు. సమాచారం తెలుసుకున్న గుంటూరు రైల్వే డివిజనల్ అధికారులు ప్రయాణికులకు నచ్చ చెప్పి గుంటూరు స్టేషన్‌కు వచ్చే విశాఖ రైలు ద్వారా విజయవాడలో ఉన్న సంఘమిత్ర రైలుకు ఎక్కించేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు.



గుంటూరు రైల్వే స్టేషన్‌లో ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు

విపత్తుతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు

విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి



సభ్యత్వ నమోదు అవగాహన పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీజేపీ నేతలు

గుంటూరు మెడికల్: ప్రకృతి విపత్తుతో రాష్ట్రంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి అన్నారు. బుధవారం గుంటూరు లాల్‌పురం రోడ్డులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో జిల్లా సభ్యత్వ ప్రముఖ్ పాలపాటి రవికుమార్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర అధ్యక్షతన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. సుజనా చౌదరి మాట్లాడుతూ మాకు చేతనైనంత వరకు వరద బాధిత ప్రజలకు సేవ చేస్తూనే ఉన్నామని తెలిపారు. రాష్ట్రంలో ప్రకృతి విపత్తును జాతీయ విపత్తుగా ప్రకటించడానికి కేంద్రంలో నాలుగు విభాగాల సభ్యులు దానిపై సమీక్ష నిర్వహించి తగు నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. రాబోయే రోజుల్లో ఏపీలో శాసనసభ, పార్లమెంటు స్థానాలు పెరిగే అవకాశాల ఉన్నాయని వెల్లడించారు. జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్ మాట్లాడుతూ సభ్యత్వ నమోదు ప్రక్రియలో జిల్లాలో ఎక్కువ సభ్యత్వం చేసి జిల్లాకి మంచి పేరు తీసుకురావాలన్నారు. జిల్లా సభ్యత్వ ప్రముఖ్ పాలపాటి రవికుమార్ మాట్లాడుతూ బీజేపీ పంచనిష్టలకు ప్రతి కార్యకర్త కట్టుబడి ఉండాలని కోరారు. పార్లమెంట్ సంయోజక్ భీమినేని చంద్రశేఖర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈదర శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శి చరక కుమార్ గౌడ్, రాష్ట్ర వీవర్ సెల్ కన్వీనర్ జగ్గారపు శ్రీనివాసరావు, నాయకులు పద్మనాభం, ఎం.సుగుణ, డి.శివయ్య, ఏ లక్ష్మి, మేరీ సరోజినీ, మోర్చా అధ్యక్షులు తుల్లిమిల్లి రామకృష్ణ, నడ్డి నాగమల్లీశ్వరి యాదవ్, తుల్లిమిల్లి శ్రీను, పొన్నూరు అసెంబ్లీ కన్వీనర్ సుధాకర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటును నిలిపివేయాలి



ఆర్జేడీ లింగేశ్వరరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సంఘ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన ఉపాధ్యాయ పని సర్దుబాటును నిలిపివేయాలని మోడల్ టీచర్స్ యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందోలు రవికుమార్ కోరారు. బుధవారం పాఠశాల విద్య ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డిని ఆర్జేడీ కార్యాలయంలో కలిసిన సంఘ నాయకులు పని సర్దుబాటు ప్రక్రియలో జరిగిన అవకతవకలు సరి చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ జెడ్పీ, మండల పరిషత్ పాఠశాలల్లోని మిగులు ఉపాధ్యాయులను నగరపాలక సంస్థల పాఠశాలల్లో సర్దుబాటు చేయటం నిబంధనలకు వ్యతిరేకమని, తక్షణమే సంబంధిత ఉపాధ్యాయులను జెడ్పీ, మండల పరిషత్ యాజమాన్యాల్లోని పాఠశాలలకు పంపాలన్నారు. ఆర్జేడీని కలిసిన వారిలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మురికిపూడి దేవపాల్, నగర అధ్యక్షుడు వై.మనోజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ అర్భతుల్లా, పి.రమేష్, కె.గోపి ఉన్నారు.